# ఒంటరి శరీరం

రాత్రి పదకొండు గంటలు...

చాలా మంది నిద్రలో మునిగిపోయి ఉంటారు. మొగుడూ పెళ్ళాలైతే సరససల్లాపాల్లో మునిగి తేలుతూ ఉంటారు.

నామీద నిద్రాదేవి అలిగింది... ఎప్పటికి మల్లె.

మంచంమీద మేను వాల్చి ఎన్ని గంటలైనా నిద్ర రాకపోతే ఆ నరకం ఎలా ఉంటుందో అనుభవించేవాళ్ళకే తెలుస్తుంది. నిద్ర కోసం భయంకరంగా పోరాడటం... చివరికి ఘోరంగా ఓడిపోవడం...

'నిద్ర మాత్రలు వేసుకుని పడుకో. ఎందుకు రాదో చూద్దాం. నిద్ర సహజంగా రాకపోతే దాన్ని బలవంతంగా రప్పించుకోవడమే' అన్నాడు వశిష్ఠ.

మల్లె మొగ్గల కౌగిలింతలా సుతిమెత్తగా హత్తుకుని... పూల మృదు పరిమళంలా రెప్పలమీద ఉదారంగా వాలే నిద్రా... మొరటుగా ఈడ్చుకొచ్చి కళ్ళలోగిళ్ళలో కట్టేసుకున్న నిద్రా... రెండూ ఒకటెలా అవుతాయి?

మనసు ప్రశాంతంగా ఉంటే కదా నిద్ర రావడానికి? సంక్షుభిత సంద్రంలా అల్లకల్లోలంగా ఉంటే నిద్రకు లంగరు అందేదెలా?

'నీకేం తక్కువ? అంత అశాంతిగా ఎందుకుంటావు? నీ అసంతృప్తికి ఒక్క కారణం చెప్పు' అంటాడు వశిష్ఠ.

నేను ప్రేమించి, ఆరాధించి, మోహించి... పెళ్ళి చేసుకున్న వశిష్ఠ... ముప్పయ్యేళ్ళ క్రితం... ముప్పయ్యేనా... మూడు యుగాలక్రితమేమో అన్పించేలా...

పక్కకు తిరిగి చూశాను. మంచానికి ఆ చివరగా పడుకుని నిద్రపోతున్నాడు.

ఎంత ప్రశాంతంగా ఉందో మొహం....

నిజమే. నాకేమీ కొదవలేదు. వశిష్ఠ పెద్ద హోదా గల ఉద్యోగంలో ఉన్నాడు. నాకు బ్యాంకులో ఉద్యోగం. రెండు సార్లు ప్రమోషన్‌ని తిరస్కరించాను... బాధ్యతలు మోయలేనంత బరువు కాకూడదని. ఒక కొడుకు ఒక కూతురు. అమెరికాలో సెటిలైనారు. మనవళ్ళు.. మనవరాళ్ళు... దేనికీ తడుముకోవాల్సిన అవసరం లేని జీవితం.

కానీ జీవితానికి అవి చాలా... సుఖాలూ సౌకర్యాలూ ముఖ్యమా... మనసనేది ఉందిగా... పాపం పిచ్చి మనసు. ఎవ్వరూ పట్టించుకోరు. ఒంటరితనం శాపం కదూ. సమూహాల్లో మసలుతున్నా ముల్లులా గుచ్చుకునే ఒంటరితనం... పక్కన వశిష్ఠ కదుల్తున్నా గుండెల్లో కలుక్కుమనే ఒంటరితనం...

మంచానికి ఈ చివర నేను... ఆ చివర వశిష్ఠ. రెండు ధృవాలకు గుర్తుగా...

నదీ ప్రవాహం ఒరుసుకుంటూ పోయే రెండు గట్లు... నీళ్ళ బంధం కలిపినట్లే కన్పిస్తుంది. కానీ గట్లు మాత్రం కల్సుకోవు. ఒకదాన్ని మరొకటి తాకవు. తన్మయత్వంతో అల్లుకుపోవు.

ఓ గట్టు మరో గట్టుని నీళ్ళ వేళ్ళతో ఆత్మీయంగా స్పర్శిస్తుందనుకుంటా. నీటి పెదవుల్ని చాపి ప్రేమగా ముద్దాడుతుందనుకుంటా. నాకా అదృష్టం కూడాలేదు.

అసలీ మంచం ఇంత పెద్దదిగా ఎందుకుంది? నలుగురు సుఖంగా పడుకోవచ్చు. ఇప్పుడు ఇద్దరమే. దీన్ని సగానికి తెగ్గొట్టి ఇద్దరికే సరిపడేలా రిపేరు చేస్తే బావుండు. అప్పుడు వశిష్ఠ శరీరం నాకు దగ్గరగా... తాకకుండానే తగిలేలా... ఆ వెచ్చదనం వూరడిస్తూ... ఓదారుస్తూ... అప్రయత్నంగానే చేయి చాపాను. నా వేలి కొసలకు తగులుతూ అతని శరీరం...

'అంత దూరంగా ఎందుకు పడుకుంటారు? నాకు దగ్గరగా, తగిలేలా పడుకోవచ్చుగా' అన్నానోసారి.

'నాకలా నిద్ర రాదు. చిరాకనిపిస్తుంది' అన్నాడు.

చెంపమీద ఛెళ్ళున చరిచినట్లు... నగ్నంగా చేసి శరీరం మీద వాతలు తేలేలా కొరడా ఝుళిపించినట్లు...

పెళ్ళయిన కొన్ని సంవత్సరాల వరకు 'నిన్ను కౌగిలించుకుని పడుకుంటే తప్ప కంటి మీద కునుకు రాదు తెలుసా' అంటూ గారాలు పోయింది ఇతనేగా.

అప్పటి కలయికలో శరీరవాంఛతో పాటు ముడిపడిన గాఢమైన అనురాగం ఉండేది. గుండె నిండా తడి... ఆర్ద్రత... నిండు జలాశయంలా... ఇప్పుడేమైందో... ఎండిన కాసారంలా... ఎడారిలా... అంతా పొడి పొడిగా... ఓ తీయటి కబురుండదు... కవ్వింత ఉండదు... కౌగిలింతలుండవు. రొటీన్‌గా...సెక్స్ శరీరానికే పరిమితమా... మనసుక్కాదా... యంత్ర స్పర్శలా మిగిలిపోతే మనసు నా మనసులా బండబారిపోదూ... శరీరాలు కబుర్లాడుకోవాలి... చేతి వేళ్ళు స్వీట్ నథింగ్స్‌ని గుసగుసలుగా చెప్పుకోవాలి... వీణ మీటినట్లు పులకింతలు కలగాలి... అప్పుడు కదా మనసు మురిసిపోయేది...

వశిష్ఠకెలా చెప్పను? సున్నితమైన విషయాలు ఈ మగాళ్ళకెందుకు అర్థం కావు? నేను ఒంటరిదాన్ని కాదని నమ్మకం కలిగించే ఆత్మీయ స్పర్శ కావాలి నాకు... మనసే కాదు శరీరమూ ఒంటరితనాన్నుంచి విముక్తి కోరుకుంటుంది. ఓ మృదు పలుకు, ఓ లాలింపు, ఓ తీయటి వాక్యం మనసునెంత సేద తీరుస్తుందో, అనురాగపూరితమైన స్పర్శ శరీరానికంతటి హాయిని అందిస్తుంది.

చిన్నప్పుడు అమ్మ వొళ్లో, అమ్మ కౌగిలింతలో ఎన్ని స్వర్గాలు విచ్చుకునేవో... అమ్మ వొళ్ళంతా నిమిరితే అణువణువూ అమృతం తాగుతున్నంత తీయగా ఉండేది. పెళ్ళయిన తర్వాత అతని స్పర్శ వెచ్చగా... ప్రేమకు సాక్షిలా... మా అనుబంధానికి నిలువెత్తు నిదర్శనంలా అన్పించేది. పిల్లలు పుట్టాక వారిని దగ్గరగా హత్తుకుంటే ఎంతటి పులకింత! ఎంతటి నిశ్చింత!

కానీ ఇప్పుడు... అమ్మ చనిపోయింది. పిల్లలు పెద్దవాళ్ళయి దూరంగా

వెళ్ళిపోయారు. వశిష్ఠ... దగ్గరగా ఉన్నా , నా శరీరాన్ని అనాథలా చేసి వదిలేసినట్లు... నిశ్చింతగా ఎలా నిద్రపోతున్నాడో...

రెండు దాటింది. నిద్ర రావటం లేదు. దుఃఖం వస్తోంది. కన్నీళ్ళు వస్తున్నాయి.

★ ★ ★

శనివారం నాల్గింటికే బ్యాంక్‌నుంచి యింటికొచ్చేశాను. తొందరగా తయారయి బైటికెళ్ళబోతూ ఆగిపోయాను. ఈ విషయంలోనే పోయిన వారం వశిష్ఠతో గొడవైంది. మరలా అక్కడికే వెళ్ళానని తెలిస్తే మరింత గొడవ జరగటం ఖాయం.

కానీ మనసు మాత్రం అటువైపుకే లాగుతోంది. వశిష్ఠ రావడానికి మరో రెండు మూడు గంటలైనా పడ్తుంది. ఆలోపల నేను వెళ్ళి వచ్చేయవచ్చు. వశిష్ఠకు తెలిసే అవకాశమే లేదు.

ఐనా నేను చేస్తున్నది తప్పు కానప్పుడు వశిష్ఠకు ఎందుకు భయపడాలి? నాకు నచ్చిన పనిని దొంగచాటుగా ఎందుకు చేయాలి?

అలాగని అతనికి చెప్పి పర్మిషన్ తీసుకోవాల్సిన అగత్యమూ లేదు. నేనూ సంపాదిస్తున్నాను. అందులో కొంత భాగాన్ని నా కోసం ... అచ్చంగా నాకోసం ఖర్చు చేసే హక్కు నాకుంది. ఎటొచ్చీ తనకు నచ్చటం లేదని చెప్పాడు కాబట్టి అతనికి తెలిసేలా చేయడమే మంచిదనిపించి వశిష్ఠకోసం ఎదురుచూస్తూ కూచున్నా.

వశిష్ఠ వచ్చీ రాగానే బైటికెళ్ళడానికి తయారుగా ఉన్న నా వైపు ఎగాదిగా చూశాడు.

"షాపింగ్‌కెళ్తున్నావా?" అని అడిగాడు.

"కాదు. ప్రతి శనివారం వెళ్ళే చోటికే" అన్నాను.

"అక్కడికెళ్ళొద్దని చెప్పాగా. ఒకసారి చెప్తే అర్థం కాదా?"

"ఎందుకు వెళ్ళకూడదు? నేను వెళ్తాను. నచ్చిన చోటికి వెళ్ళే అధికారం నాకుంది"

"ఏదో ఒకట్రెండుసార్లంటే ముచ్చటపడ్తున్నావనుకున్నాను. నీకది వ్యసనంలా మారిపోయింది. మంచిది కాదు. నామాటిను. మానేసెయ్"

"మానను. బ్యూటీ పార్లర్ కెళ్ళటం... అందునా వారానికోసారి... ఏదో మహాపరాధం చేస్తున్నట్లు వారిస్తున్నారు. నేను వెళ్తుంది బాడీ మసాజ్‌కే... బ్యూటీ కాన్షస్‌తో కాదండీ. ఆ ఒక్కరోజైనా కంటినిండా నిద్ర పడ్తుందన్న ఆశతో"

"ఎవరైనా వింటే నవ్విపోతారు. నిద్ర పట్టకపోతే డాక్టర్ దగ్గరకెళ్ళాలిగాని మసాజ్‌సెంటర్ల కెళ్ళరు"

"నాకలా బావుంటోంది. శరీరం రిలాక్స్ అవుతోంది. మీరాపినా నేను వెళ్ళి తీర్తాను"

"అంటే నా మాటని ఖాతరు చేయవన్మాట"

"మీకు చాలా సార్లు చెప్పాను... నా మనసుకు నచ్చంది ఎవ్వరు చెప్పినా చేయను. అలానే నా మనసుకు నచ్చింది ఎవ్వరు వద్దన్నా ఆపను"

అప్పుడే "మామయ్యా బావున్నావా? అత్తయ్యా ఎలా ఉన్నావు?" అంటూ సూట్‌కేస్‌తో సహా దిగిపోయాడు సునీల్.

"హాయ్ సునీల్... ఇపుడేనా రాక? ఇట్స్ ఎ ప్లెజంట్ సర్‌ప్రైజ్" అంటూ చేతులు చాపి అతన్ని కౌగిలించుకుని వీపుని రెండు మార్లు తట్టి వదిలేశాడు వశిష్ఠ. సునీల్ కూడా వశిష్ఠని ఆలింగనం చేసుకున్నాడు.

సునీల్ సత్యం కంప్యూటర్స్‌లో పెద్ద హోదాలో ఉన్నాడు. బెంగుళూరులో సెటిలై పదేళ్ళు దాటింది. వశిష్ఠకు నలుగురు అక్కయ్యలు. సునీల్ పెద్దక్కయ్య కొడుకు. వశిష్ఠకన్నా ఏడెనిమిదేళ్ళు చిన్న. అంతే.

వశిష్ఠకు తన పెద్దక్కయ్యంటే వల్లమాలిన ప్రేమ. వశిష్ఠ పుట్టిన మూడేళ్ళకే

అమ్మ చనిపోతే పెద్దక్కయ్యే అమ్మలా పెంచిందట. సునీల్‌ని చూస్తే తన పెద్దక్కయ్యని చూసినట్లే ఉంటుంది అంటాడు వశిష్ఠ. వాళ్ళిద్దరూ మామా మేనల్లుడిగాకంటే అప్త మిత్రుల్లా కల్సిపోతారు.

సునీల్ ఏదో మాట్లాడ్తున్నా పరధ్యానంగా వింటున్నా... మనసులో ఎన్నో ప్రశ్నలు సాలెగూడులా అల్లుకుంటూ... సునీల్‌ని చూడగానే వశిష్ఠ ఎందుకు కౌగిలించుకున్నాడు... అది ఆత్మీయ స్పర్శ... అనురాగ బంధం... మనసులోని భావాన్ని వ్యక్తం చేసేవి మాటలే కాదు, శరీరం కూడా... ప్రేమ కోరుకునేది మనసే కాదు శరీరం కూడా...

మనుషులు కల్సినప్పుడు షేక్ హ్యాండ్ పేరుతో చేతుల్ని స్పర్శించేది ఆ భాషలో మాట్లాడుకోడానికే. నా శరీరం మూగగా రోదిస్తున్న విషయం వశిష్ఠకు తెలీటం లేదు... వళ్ళంతా చెవులుంటే తప్ప విన్పించని వేదన... మధురమైన స్వరాలు పలికే వీణ నా శరీరం... ఏదో మూలకు విసిరేసి... బూజుపట్టి... వైణికుని వేలి కొసల స్పర్శ కోసం పరితపిస్తూ... ఎదురుచూస్తూ...

నీరజ గుర్తొచ్చింది. మసాజ్ చేస్తున్నప్పుడు నా శరీరం మీద సుతారంగా కదిలే ఆమె వేళ్ళు గుర్తొచ్చాయి.

బైటికెళ్ళే పనుందని, ఓ గంటలో తిరిగొస్తానని సునీల్‌కి చెప్పి, గుచ్చుకుంటున్న వశిష్ఠ చూపుల్ని పట్టించుకోకుండా బైట పడ్డాను.

హిమాయత్ నగర్‌లో ఉన్న రియాస్ బ్యూటీ పార్లర్‌కి ఆటో మాట్లాడుకున్నా.

దారినిండా ఆలోచనలే...

నిద్ర పట్టడం లేదని లంచ్‌రూంలో కొలీగ్‌తో మాట్లాడ్తుంటే విని మరో కొలీగ్ సుహాసిని బాడీ మసాజ్ సలహా ఇచ్చింది. 'అనుభవంతో చెప్తున్నాను. మసాజ్ చేయించుకున్న రోజు హాయిగా నిద్ర పడ్తుంది. బాడీ అంతా రిలాక్స్ అవుతుంది. ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. మసాజ్ వల్ల కండరాలన్నిటికీ రక్త ప్రసరణ బాగా జరుగుతుంది.' అంది.

'సిగ్గనిపించదా శరీరంలో ఎక్కువ భాగం నేకెడ్‌గా ఉండగా వేరే వాళ్ళ

ఒంటరి శరీరం

కళ్ళబడటానికి?' అనడిగా.

'సిగ్గెందుకు? మసాజ్ చేసే వాళ్ళతో సహా అక్కడందరూ ఆడవాళ్ళే ఉంటారు' అంది.

మొదటి సారి రియాస్ బ్యూటీ పార్లర్‌కి వెళ్ళినపుడు చాలా అసౌకర్యంగా అన్పించింది. మసాజ్ చేయించుకోడానికొచ్చాను అని చెప్పడానికి కూడా సిగ్గుపడిపోయాను. మసాజ్ చేయడానికొచ్చిన నీరజ చిన్న టర్కీ టవల్ చేతికిచ్చి, బట్టలు తీసేసి దాన్ని చుట్టుకోమన్నప్పుడు మరీ సిగ్గనిపించింది.

కానీ ఆ రాత్రి వళ్ళు తెలీనంత నిద్ర పట్టింది. శరీరమంతా దూదిలా తేలికైనట్లు... కొత్త శక్తేదో రక్తనాళాల్లో ప్రవహిస్తున్నట్లు... అందుకే తర్వాతి వారం కూడా వెళ్ళాను. అలా అలా అలవాటైపోయి, ప్రస్తుతం అనివార్యమైపోయింది.

రియాస్ బ్యూటీ పార్లర్‌లోకి అడుగు పెట్టగానే రిసెప్షన్‌లో ఉండే ఉషారాణి పలకరింపుగా నవ్వింది. "మసాజ్‌కే కదా మేడం" అంది.

ఆమె ఎదురుగా ఉన్న సోఫాలో కూచుంటూ "అవును" అన్నాను.

"కొన్ని నెలలుగా చూస్తున్నాను. మీరు మసాజ్ తప్ప ఫేషియల్‌గాని, హెయిర్ స్టైల్స్‌గానీ చేయించుకోరెందుకు? మీ ఐబ్రోస్ చూశారా ఎంత థిక్‌గా ఉన్నాయో? ఒక్కసారి హెయిర్‌ట్రిమ్ చేసుకుని చూడండి. ఫేషియల్ చేయించుకుంటే మీ ఏజ్ పదేళ్ళు తగ్గిపోయి కన్పిస్తుంది మేడం"

"నాకు నీ అంత కూతురుంది. నీకన్నా పెద్ద కొడుకున్నాడు. యిద్దరు మనవలున్నారు. ఒక మనవరాలుంది. ఈ వయసులో నా అందాన్ని పెంచుకోవాలనో, వయసు తక్కువలా కన్పడాలనో కోరికలు లేవు"

"అలా అంటారేమిటి మేడం... యిక్కడికొచ్చే వాళ్ళలో సగానికి పైగా మీ వయసు వాళ్ళే"

"ఎవరి ఇష్టాలు వాళ్ళవి"

"సరే మీ ఇష్టం. మీకు మసాజ్ చేసే నీరజ ఓ కష్టమర్‌తో బిజీగా ఉంది. కావాలంటే వాణి ఉంది. చేయించుకుంటారా?"

"వద్దు. వెయిట్ చేస్తాను"

మీరదే సమాధానం చెప్తారని నాకు తెలుసు అన్నట్లు నవ్విందా అమ్మాయి.

మరలా ఆలోచనలు... వశిష్ఠ చెప్పినట్లు నేను అడిక్ట్ అయ్యానా? కేవలం బాడీ మసాజే కావాలనుకుంటే నీరజైతే ఏమిటి వాణి ఐతే ఏమిటి? నీరజే కావాలని ఎందుకడిగాను?

నీరజ చేతి స్పర్శకు అలవాటు పడ్డానా? నాకు తెలీకుండానే అంతశ్చేతనలో... ఆకర్షితురాలినవుతున్నానా?

తల విదిలింపుతో ఆ ఆలోచనని పక్కకు నెట్టాను. కొన్ని నెలలుగా ప్రతి శనివారం నీరజ చేత మర్దన చేయించుకోవటం అలవాటైంది. నీరజ సమక్షంలో తొంభై శాతం నగ్నంగా ఉన్నా... అలవాటు కావటం వల్ల కంఫర్టబుల్‌గా అనిపిస్తుంది. అంతే.

నాతో పాటు సోఫాలో కూచుని ఉన్న రాధికారెడ్డి ఉషారాణితో కబుర్లలోకి దిగింది. రాధికారెడ్డి నాకు తెలుసు. బాగా పేరున్న డాక్టర్.. చిల్డ్రన్ స్పెషలిస్ట్. తరచూ ఫేషియల్ చేయించుకోడానికి వస్తో ఉంటుంది.

"ఎలా ఉంది మీ పాప? ఇప్పుడెన్నో నెల?" అని అడిగింది రాధికారెడ్డి.

"బాగానే ఉంది డాక్టర్. రెండో నెలపోయి మూడో నెల వచ్చింది. ఎటొచ్చీ ఈ మధ్య బాగా చిక్కిపోతోంది. యింటికొచ్చిన ప్రతివాళ్ళూ దాన్ని ఎత్తుకుని నలిపేస్తున్నారు. అందువల్లే పిల్ల ఎండిపోతోందని అమ్మ అంటోంది. ఏం చేయాలో తెలీటం లేదు. పాపను ముట్టుకోవద్దని ఎలా చెప్పటం?" అంది ఉషారాణి.

"దాని వల్ల చిక్కిపోవటం ఉండదు. పిల్లల్ని ఎత్తుకోవాలి. ముద్దాడాలి. ఆ స్పర్శ వాళ్ళకు బలాన్నిస్తుంది. సెక్యూర్ ఫీలింగ్‌నిస్తుంది. స్నానం చేయిస్తే పిల్లలకు

బలం అని మన పెద్దవాళ్ళు అనటం విన్లేదా? నీళ్ళ వల్ల కాదు బలం... నీళ్ళు పోసేటప్పుడు శరీరాన్ని మృదువుగా తాకుతాం. సున్నిపిండి పెట్టి రుద్దుతాం. అదే మర్దన చేయటం అన్మాట. ఎంత ఎక్కువ స్పర్శకు లోనైతే పిల్లలు అంత బాగా ఎదుగుతారు. స్పర్శ అనేది ప్రేమకు గుర్తు. అది శరీర భాష. పిల్లలకు బాగా అర్థమౌతుంది" అందావిడ.

నా ఆలోచనలకు మరలా రెక్కలు మొలిచాయి. నా శరీర భాష వశిష్ఠకి అర్థం కావటంలేదా? నేనూ చంటి పిల్లలా స్పర్శను కోరుకుంటున్నానా? 'మసాజ్ చేసే అమ్మాయి నీ శరీరాన్ని మర్దన చేస్తుంటే నువ్వు తృప్తి పడ్తున్నావు' అన్నాడు వశిష్ఠ.

"మీరు లోపలికి వెళ్ళొచ్చు మేడం. నీరజ ఖాళీగానే ఉంది" అంది ఉషారాణి.

ఆలోచనల్లోంచి బైట పడి, క్యూబికల్‌లా ఉన్న గదిలోకి నడిచాను.

నన్ను చూడగానే విశాలంగా నవ్వింది నీరజ. "మీరు రావడం ఆలస్యమైతే ఏదో వెలితిగా అన్పించింది తెలుసా... రారేమో అనుకున్నా. యింకొద్దిసేపు చూసి నేనే ఫోన్ చేసి కనుక్కుందామనుకునే లోపల మీరే వచ్చేశారు" అంది.

"వద్దామని బయల్దేరేలోపల బంధువులొచ్చారు" నవ్వుతూ సమాధానమిచ్చాను.

బట్టలు విప్పుదీసి, తను అందించిన టర్కీ టవల్ చుట్టుకుని, ఫైబర్‌తో చేసిన కాట్ మీద బోర్లా పడుకున్నాను.

నీరజ ఏవో కబుర్లు చెప్తూ... మసాజ్ ఆయిల్ చేతుల్లోకి తీసుకుని, శరీరం మీద రాస్తూ మెల్లగా మర్దన చేస్తోంది. ఆ వేళ్ళకు నా శరీర భాష తెలుసనుకుంటా... ఆత్మీయంగా స్పర్శిస్తున్న వేళ్ళు.. జీవకణాలు తీయటి కబుర్లాడుకుంటున్నాయి... హాయిగా, మత్తుగా శరీరం స్పందిస్తోంది.

ఇపుడు నా శరీరం ఒంటరిది కాదు...

***(ఆంధ్రజ్యోతి, ఆదివారం. 20, ఏప్రిల్ 2008)***

★ ★ ★